28న 'వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా'తో ఏఐవైఎఫ్ రాష్ట్ర సదస్సు

హిమాయత్‌నగర్: 'వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా' నినాదంతో ఏఐవైఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా 'దేశ పాలకుల విధానాలు–నేటి యువత కర్తవ్యం' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ నేతలు తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 28న వరంగల్, ఎల్‌బీ కళాశాల జయసేన ఆడిటోరియంలో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.శివసేనారెడ్డిని శుక్రవారం కలిసి ఏఐవైఎఫ్ నేతలు కోరారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ... కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం కారణంగా నిరుద్యోగ రేటు 26 శాతం పెరిగిందని అనేక నివేదికలు స్పష్టం చేశాయన్నారు. మోదీ విధానాలను వ్యతిరేకిస్తూ రానున్న ఎన్నికల్లో దుష్ట బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్యప్రసాద్, శ్రీమాన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక

నిజాంపేట్: ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్ పోటీలకు ఈనెల 24న బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో మేడ్చల్ జిల్లా సీనియర్ పురుషుల జట్టు ఎంపిక ఉంటుందని మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కాసాని వీరేష్ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 2 నుంచి 4 వరకు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో పోటీలు ఉంటాయన్నారు. క్రీడాకారులు 24వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీకి రావాలని నిర్వాహకులు కోరారు. ఔత్సాహికులు స్థానికంగా ఉంటూ, 85 కిలోల బరువు కలిగి ఉండాలన్నారు. ఆధార్, 2పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తెచ్చుకోవాలన్నారు. ఇతర వివరాలకు కోచ్‌లు చంద్రహాస్, షకీల్ 9908205333, 7396749998.

రైతులపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం

రంగారెడ్డినగర్: ఆందోళన చేపట్టిన రైతులపై పోలీసుల దాడిని ఖండిస్తూ శుక్రవారం షాపూర్‌నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ... పోలీసుల కాల్పుల్లో పంజాబ్ రాష్ట్రానికి రైతు శుభకరన్ సింగ్ మరణించాడని, సంబంధిత పోలీసులను వెంటనే హత్యా నేరం కింద అరెస్టు చేయాలన్నారు. ఈ కాల్పుల సంఘటనపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అణచివేత ద్వారా ఉద్యమాన్ని ఆపాలనుకోవడం ఫాసిస్ట్ ఆలోచన తప్ప వేరు కాదన్నారు.

'రైతు ఉద్యమాన్ని కేంద్రం అణచివేయాలని చూస్తోంది'

నిజాంపేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులు చేపట్టిన ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తోందని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. దేశరాజధాని న్యూఢిల్లీ సరిహద్దులో పోలీసులు జరిపిన కాల్పుల్లో యువరైతు శుభకరణ్‌సింగ్ మృతి చెందడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం బాచుపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

సుభాష్‌నగర్: పేదలను ఆదుకునేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఎస్పీఆర్ ట్రస్ట్ చైర్మన్ సాంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాజులరామారం సంహిత ఎన్‌క్లేవ్‌కు చెందిన సత్యనారాయణ రాజేష్ కుమార్తె సంస్కృతి బ్లడ్ కాన్సర్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. శుక్రవారం పున్నారెడ్డి కుమార్తె హేమ జన్మదినాన్ని పురస్కరించుకుని వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం రూ.25వేలను సత్యనారాయణ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ముస్ముందు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంటామన్నారు.

సదరన్ అకాడమీతో సెయింట్ మార్టిన్స్ ఒప్పందం

సుభాష్‌నగర్: సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాల, సిడ్నీకి చెందిన సదరన్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌ల మధ్య సహకారం విషయమై శుక్రవారం అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా సెయింట్ మార్టిన్ డైరెక్టర్ సంతోష్‌కుమార్ పాత్రా మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో తమ విద్యార్థులకు పరిశోధన, ఉన్నత విద్య కోసం కన్సల్టింగ్ వంటి విషయాల్లో లబ్ధి చేకూరనుందన్నారు. ఈ అవగాహన ఒప్పందంలో సదరన్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రతినిధి డాక్టర్ జాన్, డీన్, కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, డైరెక్టర్ జైకిసాన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించడంలో విఫలం

కుత్బుల్లాపూర్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గత నాలుగు పర్యాయాలుగా జరిగిన ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి కదలిక లేకుండా పోయింది. కేవలం మొక్కుబడిగా ప్రజావాణి నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా వారం రోజుల్లో వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించాలని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ, ఇక్కడ ఆయా విభాగాల వారీగా వచ్చిన ఫిర్యాదుల విషయంపై ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఆయా విభాగాల వారీగా ఫిర్యాదులను పంపించాల్సిన అధికారులు సైతం వాటిని తమ వద్దే పెట్టుకొని కాలయాపన చేయడం మూలంగా వందలాది ఫైళ్లు మూలన పడి ఉన్నాయని, చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించకుండా కాలయాపన చేయడం ఎంత వరకు సమంజసమని సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల విషయంపై చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

పెట్టుబడుల పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలు

హిమాయత్‌నగర్: సైబర్ నేరగాళ్లు సష్టించిన నకిలీ స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడులు పెట్టించి ఓ వృద్ధుడిని సైబర్ కేటుగాళ్లు మోసం చేశారు. పోలీసుల సమాచారం మేరకు... బాధిత వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు స్టాక్ మార్కెట్ టిప్స్ పేరుతో వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ఆకర్షణీయమైన ప్రకటనల ద్వారా వాట్సాప్ బిజినెస్ గ్రూప్‌లో ×ఏ11 ట్రేడర్స్ సర్వీస్ క్లస్టర్‌₹ అనే లింక్ వచ్చింది. స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు సంబంధించి లాభాలు వస్తాయని సందేశాలను అందులో వచ్చాయి. దీంతో వారు చెప్పిన విధంగా ×ఎస్‌సీఐఈ₹ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. యాప్‌లో నమోదు చేసుకున్న తర్వాత బాధితుడు తన ఖాతా నుంచి రూ. 16,99,000 వారు యాప్ ద్వారా బదిలీ చేశాడు. ఆ యాప్‌లో బాధితుడి డ్యాష్‌బోర్డులో పెట్టుబడి, లాభాలు ఉన్నట్లు చూపించారు. కానీ ఆ డబ్బును విత్‌డ్రా చేసుకోవాలంటే మరింత పెట్టుబడి పెట్టాలని చెప్పారు. అనుమానం వచ్చిన బాధితుడు మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'పార్కు'కు రక్షణ 'కరువు'

- పచ్చదనం దరిదాపుల్లో కనపించని వైనం
- పట్టించుకోని అధికారులు
- ఇదీ 'నల్లగండ్లలోని ట్రీ పార్కు, రాక్‌గార్డెన్' పరిస్థితి

ప్రహరీ దిమ్మెలు కూల్చి మధ్య ఉండే పైపుల అపహరణ



ప్రహరీ దిమ్మెలు కూల్చి పైప్‌లను దొంగలించిన దృశ్యం

శేరిలింగంపల్లి: పచ్చదనం దరిదాపుల్లో కనిపించదు.....పార్కులాగే అనిపించని వాతావరణం .....మొక్కుబడిగా సౌకర్యాల కల్పన.....అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టించుకోకపోవడంతో కాలనీవాసులు పార్కుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో 'ట్రీపార్కు, రాక్‌గార్డెన్' పేరుతో జీహెచ్‌ఎంసీ హడావుడిగా కొద్ది భాగంలో పార్కును అభివృద్ధి చే సింది. గతంలో ఈ స్థలంలో డంపింగ్ కేంద్రం ఉండటంతో పలువురు కోర్టు ఆశ్రయిండంతో పార్కుగా కొంతభాగాన్ని తీర్చిదిద్దారు. ఇంత వరకు భాగానే ఉన్నా పార్కులో కనీసం వాకింగ్ ట్రాక్ లెవల్‌గా లేకపోవడంతో కూడ ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్కడ చూసిన ఎండిన మొక్కలు, చెట్లు, చెట్ల వ్యర్థాలతో నిండిన వాతావరణమే అగుపిస్తుంది. ఈ పార్కును ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తే కాలనీవాసులకు ఎంతో సౌలభ్యంగా ఉండే అవకాశం ఉంది.

- నల్లగండ్లలో ట్రీపార్కు, రాక్‌గార్డెన్ పేరు పెట్టడంతో ఇది చెట్లతో నిండిపోయే పార్కుగా, దశాబ్దాల నుంచి ఉన్న భారీ బండ రాళ్లను పరిరక్షించడానికి రాక్‌గార్డెన్ కూడా ఇందులో ఏర్పాటు చేశారు.
- ఏపుగా పెరిగిన చెట్లు నిర్లక్ష్యం కారణంగా ఎండిపోయి కళావిహీనమై ఎవరూ వెళ్ళలేని విధంగా మారిపోయింది.



నల్లగండ్ల హుడాకాలనీలోని ట్రీపార్కు.

- వాకింగ్ ట్రాక్ నిర్మాణం కూడా చేసినా, లెవల్‌గా లేకపోవడంతో ఫలితం లేకుండాపోయింది.
- పది ఎకరాల్లో పార్కు విస్తీర్ణ ఉన్నా కొంత ప్రాంతంలోనే మాత్రమే అభివృద్ధి పనులు చేపట్టారు
- పార్కుకు నాలుగు రోడ్లు ఉండగా పార్కు ముందు భాగం, కుడి వైపున ఉన్న వాల్స్‌పై మాత్రమే దిమ్మెల మధ్య ఐరన్ పైపులు ఉన్నాయి. వెనుక భాగం, ఎడమ వైపు రోడ్లకు ఉన్న పైపులు గుర్తు తెలియని వ్యక్తులు వాటిని తస్కరించినా పట్టించుకునే వారు లేరా అనే ప్రశ్నలు వస్తున్నాయి.

సౌకర్యాలు కల్పించాలి

- పార్కు చుట్టూ ప్రహరీగోడను మళ్ళీ నిర్మాణం చేయించాలి
- ఎండిన చెట్లన్నీ తొలగించి కొత్తగా ట్రీ పార్కు కావడంతో ఆకట్టుకునే చెట్లు, పూల మొక్కలను పెంచేలా చర్యలు తీసుకోవాలి
- స్థానికులు సేద తీరే పరిస్థితులు కల్పించాలి
- పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి
- రాక్‌గార్డెన్ కూడా పేరులో ఉండడంతో భారీ బండరాళ్ళను మరింత ఆకర్షణీయంగా మారేలా చేయాలి, రాత్రి వేళల్లో రంగురంగుల లైట్లను అమర్చి అందరికీ సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆకట్టుకునేలా చేయాలి
- పార్కులో బెంచీలు, కింద కూర్చోవడానికి అవసరమైన గ్రాస్ ఏర్పాటు చేయాలి
- నిత్యం విధుల్లో నిమగ్నమయ్యేవారు సాయంత్రం వేళల్లో పార్కులోకి కుటుంబ సభ్యులతో వచ్చి సేద తీరేలా వాతావరణం కల్పించడానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



డివిజన్లలోని ట్రాఫిక్ సమస్యపై సీఐ శ్రీనివాసరావుతో సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కూకట్‌పల్లి సీఐ శ్రీనివాసులుతో సమీక్ష నిర్వహించారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ, సప్తగిరి కాలనీ, భాష్యం స్కూల్ ప్రాంతం, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శుభోదయ, నవోదయ కాలనీల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య చాలా తీవ్రంగా ఉంటోందని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. దీంతో పాఠశాలలకు, ఉద్యోగాల నిమిత్తం వెళ్లే వారు నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. గంటల కొద్దీ రోడ్లపైనే ఉండాల్సి వస్తోందని... ట్రాఫిక్ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని.. ప్రత్యమ్నాయ మార్గాలపై దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ సమస్యలేకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కాలనీవాసులు శర్మ, మల్లయ్య, హర్ష, రాజిరెడ్డి, ప్రవీణ్, శివశంకర్, మదన్, సత్యనారాయణ, అల్లురయ్య, స్వరూపనంద్, శ్యామ్‌కుమార్, హేమచందర్, వినోభా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాలా, చెరువులను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటాం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని నాలాలు, చెరువుల స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. గత పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టడంతో వర్షకాలంలో ఈ ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయని అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లిలోని రంగధాముని చెరువు ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ సిటీప్లానర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అక్కడ కొంతమంది అపార్టుమెంట్ వాసులు నాలాపై శాశ్వత కట్టడాలు నిర్మించి కబ్జా చేశారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో నాలాలు, చెరువులను కబ్జా చేస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో



కూకట్‌పల్లి రంగధాముని చెరువు ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న బండి రమేష్

నాయకులు శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తూము వేణు, నాగిరెడ్డి, కృష్ణ రాజ్‌పుత్, దినేష్‌కుమార్, చున్నూ పాష, పుష్పారెడ్డి, రేష్మ, కృష్ణవేణి, జ్యోతి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దాడులు ఆపి.. డిమాండ్లను నెరవేర్చాలి



యువ రైతు మృతి చెందిన ఘటనకు నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కూకట్‌పల్లి: కేంద్ర బీజేపీ ప్రభుత్వం, హరియాణా ప్రభుత్వాలు యువరైతు శుభకరణ్‌సింగ్‌ను పంజాబ్ బార్డర్‌లో క్రూరంగా హత్య చేయడానికి నిరసనగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, హరియాణా సీఎం బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని సీఐటీయూ కూకట్‌పల్లి మండల కార్యదర్శి కృష్ణనాయక్, జిల్లా అధ్యక్షులు శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం యువ రైతు మృతి చెందిన ఘటనకు నిరసనగా కేపీహెచ్‌బీ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు.

- ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులను హత్య చేసి, గాయపర్చిన ఘటనకు కారణమైన పోలీస్ సిబ్బందిపై సెక్షన్ 302 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి వెంటనే వారందరిని బర్తరఫ్ చేయాలన్నారు. మృతి చెందిన రైతు కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, రైతులకు సంక్షేమ పథకాలు అందిస్తామని వాగ్దానాలు చేసి అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు.
- వాటిని సాధించుకోవటంలో రైతులు పోరాటం చేస్తున్న సందర్భంలో ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. దేశానికి వెన్నుముక అయిన రైతులపై చేస్తున్న దాడిని వెంటనే మానుకొని వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి చిరంజీవి, మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, భాషా, లక్ష్మణ్, సీఐటీయూ మండల నాయకులు రాములు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీగణేష్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీగణేష్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు ఈనెల 25వ తేదీ ఆదివారం ఉదయం 8గంట నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పోతురాజు నర్సింగ్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష పదవిలో ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. పన్నాల రాజశేఖర్‌రెడ్డికు ఉదయించే సూర్యుడు, గోపాల్‌సింగ్‌కు సీలింగ్ ఫ్యాన్, ప్రసాద్‌గౌడ్‌కు టేబుల్ క్లాత్ గుర్తులను కేటాయించామని తెలిపారు. అదే రోజు కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు.

రేపు జెన్‌నెక్ట్స్ స్కూల్ వార్షికోత్సవం

మోతీనగర్: జెన్‌నెక్ట్స్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం బోరబండలోని ఎస్‌డీ ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్నట్లు స్కూలు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, గౌరవ అతిథులుగా అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం, బీఆర్‌ఎస్ మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, ప్రత్యేక అతిథిగా కూకట్‌పల్లి మండల ఎంఈఓ వి.ఆంజనేయులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాఠశాల చైర్మన్ బి. జితేంద్ర, ప్రిన్సిపల్ బి.లతలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

'మనూ'లో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోర్సులకు గడువు పెంపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోర్సుల దరఖాస్తుకు గడువు తేదీని పొడిగించినట్లు యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ శుక్రవారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ పీహెచ్‌డీలో కూడా ప్రవేశాలు అందుబాటులో ఉంటాయని,దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారానే సమర్పించుకోవాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 25వ తేదీ వరకు స్పాన్సర్డ్/సెల్ఫ్–ఫైనాన్సింగ్ మోడల్‌లో పార్ట్‌టైమ్ కోర్సులు ఉన్నాయన్నారు. ప్రవేశ పరీక్ష షెడ్యూల్ ప్రకారం మార్చి 8వ తేదీన జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ కమ్ అప్లికేషన్ రుసుము రూ.1500 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కేజ్రీవాల్‌కు ఈడీ, సీబీఐ సమన్ల వెనుక బీజేపీ కుట్ర: ఆప్

లిబర్టీ: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే కేంద్రంలోని బీజేపీ పాలకులు ప్రతిపక్ష పార్టీలపై కుట్రలు పన్నుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. రాజకీయ కుట్రలో భాగంగా ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలని ఈడీ, సీబీఐలతో అక్రమ నోటీసులు పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిబర్టీ వద్ద ఉన్న ఆప్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈడీ అక్రమ నోటీసులు పని చేయడం లేదని, అందుకే సీబీఐ ద్వారా అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎలాంటి సంబంధం లేదని, అందుకే చట్టంలో అస్పష్టమైన, ప్రేరేపించబడిన, నిలకడలేని కేసులు పెట్టి జైలులో పెట్టడానికి ఈడీ, సీబీఐలు చట్టవిరుద్ధంగా ప్రయత్నిస్తున్నాయని ఆయన తెలిపారు.

కనులపండువగా మేడారం మినీ జాతర

సమ్మక్క, సారలమ్మకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి పాపిరెడ్డినగర్‌లోని సమ్మక్క, సారలమ్మ అమ్మవార్ల మినీ జాతర మహోత్సవాలు శుక్రవారం కనులపండువగా జరిగాయి. ఈ జాతరకు ఏసీపీ హనుమంతరావు, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్‌లో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, జంపన్నలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంతో కూడిన బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించి సన్మానించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవార్ల గద్దెలకు ప్రత్యేక పూజలు జరిపి నైవేద్యాలు సమర్పించి పట్టు వస్త్రాలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో జాతర మహోత్సవ కమిటీ సభ్యులు శ్రీధర్‌పటేల్, భూపాల్ రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, రాజిరెడ్డి, ప్రకాష్‌రావు, పటేల్, బాలు యాదవ్, నరేందర్ రెడ్డి, హరియాదవ్, గోపాలరావు, శ్రీలత, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్ పటేల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవార్లను దర్శించుకుంటున్న ఏసీపీ హనుమంతరావు, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్

లాస్య నందిత మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య నందిత మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని.. ఆమె తండ్రి సాయన్న మరణం మరువకముందే ఆమె కుటుంబంలో ఇలా జరగటం చాలా బాధాకరమైన విషయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం ఇప్పటికి నమ్మలేకపోతున్నానని అన్నారు. సాయన్న కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు గుర్తు చేసుకున్నారు. ఎంతో సౌమ్యంగా అందరినీ అన్నా అంటూ పలకరిస్తూ చిరునవ్వులు చిందిస్తూ కళ్ల ముందు కనిపించే లాస్య నందిత ఇక లేదు అనే వార్త జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు.భగవంతుడు ఆమె కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

4 నుంచి డెయిరీ ఇండస్ట్రీ సదస్సు

పంజగుట్ట: ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సౌత్‌జోన్ ఆధ్వర్యంలో మార్చి 4 నుంచి 6వ తేదీ వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ×50వ డెయిరీ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్₹ నిర్వహించనున్నట్లు ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సౌత్ జోన్ చైర్మన్ సతీష్ కులకర్ణి తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కాన్ఫరెన్స్ కరపత్రాన్ని అసోసియేషన్ తెలంగాణ చైర్మన్ సి.హెచ్. రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ డాక్టర్ కె.ఆర్.రావు, సభ్యులు బి.వి.కె.రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వ్యవసాయానికి అనుబంధంగా ఉండే పాడిపరిశ్రమ అభివృద్ధికి ఈ కాన్ఫరెన్స్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ 75 సంవత్సరాలు పూర్తిచేసుకోవడం, 1989లో హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన సదస్సు తర్వాత తిరిగి 34 సంవత్సరాలకు హైదరాబాద్‌లో జరుగుతుందన్నారు. ఇందులో పాడి రంగంలో ఉన్న రైతులు, విద్యార్థులు, యువత, ఇప్పటికే ఈ రంగంలో రాణించిన ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

మరోసారి ప్రధానిగా నరేంద్ర మోదీని గెలిపిద్దాం



విజయసంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పన్నాల హరీష్‌రెడ్డి, బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: విజయ సంకల్ప యాత్రలో భాగంగా భాగ్యలక్ష్మి క్లస్టర్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గానికి ప్రవేశిస్తున్న సందర్భంగా శుక్రవారం కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ నాయకులతో మేడ్చల్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసంకల్ప యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. యాత్ర రూట్ మ్యాప్‌ను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యారావు, సూర్యప్రకాష్‌రావు, సురేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సుగుణ చౌదరి, మహేందర్, శ్రీకర్‌రావు, తదితరలు పాల్గొన్నారు.

ప్రభుత్వ, సీలింగ్ భూములను కాపాడాలి

సాక్షి, మేడ్చల్‌జిల్లా: దుండిగల్ గండిమైసమ్మ మండలం దుండిగల్ పురపాలక సంఘం పరిధిలోని సర్వే నంబర్లు 282, 284, 321 నుంచి 325, 330 నుంచి 335, 345, 358 నుంచి 362, 423 నుంచి 426 వరకు గల 106.07 ఎకరాల ప్రభుత్వం/సీలింగ్ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు చెందిన పలువురు ఉద్యోగులు విలువైన 106.07 ఎకరాల ప్రభుత్వ/సీలింగ్ భూములను ప్రైవేట్ భూములుగా చూపిస్తూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దారాదత్తం చేశారని ఆయన ఆరోపించారు. ఈ భూముల్లో ప్లాట్లు చేసి విక్రయించేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని ఆయన కోరారు. ఈ సమస్యను పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులతో సహా రెవెన్యూ అధికారుల దృష్టికి



మాట్లాడుతున్న ఎస్.మల్లారెడ్డి

తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్‌తో సహా రెవెన్యూ అధికారులు సత్వరమే స్పందించి, భూమార్పిడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని 106.07 ఎకరాల ప్రభుత్వం/సీలింగ్ భూములను కాపాడాలని కోరారు.

నేటి నుంచి జిల్లాలో విజయ సంకల్ప యాత్ర



విజయసంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీజేపీ నాయకులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో శనివారం నుంచి ఈ నెల 26 వరకు కొనసాగనున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి తెలిపారు. జిల్లా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా ఈ నెల 27న సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గంలోకి విజయ సంకల్ప యాత్ర ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. మేడ్చల్ రూరల్ జిల్లాలో శని, ఆది, సోమ వారాల్లో ప్రధానంగా జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం, కీసర, మేడ్చల్ కేంద్రాల మీదుగా బీజేపీ విజయ సంకల్ప యాత్ర కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. దమ్మాయిగూడలో విజయ సంకల్ప యాత్రను పురస్కరించుకుని ఆదివారం బహిరంగసభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు.